విశాలాంధ్ర

తిరుపతి జిల్లా

చిత్తూరు జిల్లా

మంగళవారం 18 నవంబరు 2025 | 8 పేజీలు

చిన్నశేష వాహనంపై పరమ వాసుదేవుడు అలంకారంలో పద్మావతి అమ్మరు

విశాలాంధ్ర-తిరుపతి కలెక్టరేట్: శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల తొలి రోజైన సోమవారం రాత్రి అమ్మవారు పరమ వాసుదేవుడు అలంకారంలో చిన్నశేష వాహనంపై భక్తులకు అభయమిచ్చారు. మొదటి వాహనంగా వ్యవహరించే చిన్నశేష వాహనంపై దర్శనమిచ్చే అమ్మవారు జీవకోటిని ఉద్ధరించే లోకమాతగా వెలుగొందుతారు. శేషభూతమైన ఈ ప్రపంచం సిరుల తల్లి రక్షణలో సుఖసంతోషాలను అనుభవిస్తోందని పురాణాలు తెలుపుతున్నాయి. ఈ వాహనసేవలో పాల్గొన్నవారికి యోగసిద్ధి చేకూరుతుందనే నమ్మకం భక్తుల్లో గాఢంగా ఉంది. వాహనసేవలో శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్ స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్ స్వామి, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, జెఈవో వి. వీరబ్రహ్మం, సివిఎస్‌వో కే.వి. మురళీకృష్ణ, డెప్యూటీ ఈవో హరింద్రనాథ్, అర్చకులు బాబుస్వామి తదితర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ధ్వజారోహణంతో ప్రారంభమైన

పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలు

విశాలాంధ్ర-తిరుపతి: తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలకు సోమవారం ఉదయం శాస్త్రోక్తంగా ధ్వజారోహణం నిర్వహించారు. ఉదయం అమ్మవారికి సుప్రభాత సేవ, సహస్ర నామార్చన, నిత్య అర్చన జరిపారు. అనంతరం ఉదయం 6.30 గంటలకు నాలుగు మాడ వీధుల్లో తిరుచ్చి ఉత్సవం జరిపి, ధ్వజ స్థంభ తిరుమంజనం నిర్వహించారు. ఉదయం 9.15 గంటలకు బ్రహ్మోత్సవాలకు సకల దేవతలను ఆహ్వానిస్తూ గజపటాన్ని ఆరోహణం చేశారు. టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్, జేఈవో వి.వీరబ్రహ్మం, సివిఎస్వో కే.వి. మురళీకృష్ణ, డిప్యూటీ ఈవో హరింద్రనాథ్, కంకణ భట్టార్ పి. శ్రీనివాసాచార్యులు, అర్చకులు బాబు స్వామి, అర్చకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఈవో శుక్రవారపు తోటలో ఉద్యాన విభాగం ఏర్పాటు చేసిన పుష్పప్రదర్శన, శిల్ప కళాశాల ఏర్పాటు చేసిన శిల్పకళా ప్రదర్శన, ఆయుర్వేద ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈవో శ్రీ అనిల్ కుమార్ సింఘాల్ మీడియాతో మాట్లాడుతూ, సోమవారం ధ్వజారోహణంతో అమ్మవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయని చెప్పారు. మాడ వీధుల్లో ఉండే ప్రతి భక్తుడికి వాహన సేవ దర్శనం కల్పిస్తామన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా అమ్మవారి దర్శనం కోసం వచ్చే భక్తులందరికీ మూల మూర్తి దర్శనం చేయించేలా చర్యలు తీసుకున్నామన్నారు. బ్రహ్మోత్సవాల్లో ముఖ్యమైన గజ వాహన సేవ, పంచమీ తీర్థంకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తారని, ఇందుకు అవసరమైన భద్రత, ఇతర ఏర్పాట్లకు సంబంధించిన ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారి వాహన సేవలో పాల్గొని, అమ్మవారి అనుగ్రహానికి పాత్రులు కావాలన్నారు. శుక్రవారపు తోటలో ఏర్పాటు చేసిన

2 లో

'డయల్ యువర్ సిఎండి' కి విశేష స్పందన

ఎపిఎస్పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి వెల్లడి

విశాలాంధ్ర-తిరుపతి రూరల్: విద్యుత్ వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారం కోసం ఎపిఎస్పిడిసిఎల్ నిర్వహిస్తున్న 'డయల్ యువర్ సిఎండి' కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. తిరుపతిలోని సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ ఎపిఎస్పిడిసిఎల్ సిఎండి కార్యక్రమం జరిగింది. ప్రతి సోమవారం నిర్వహించే ఈ కార్యక్రమం ద్వారా తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి 67 మంది వినియోగదారులు విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకువచ్చారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరు, విద్యుత్ లైన్ మార్పు, కాలిపోయిన/చోరీకి గురైన ట్రాన్స్ఫార్మర్ల మార్పు, లో-ఓల్టేజ్ సమస్య. ట్రాన్స్ ఫార్మర్ల సామర్థ్యం పెంపు, ఇనుప విద్యుత్ స్తంభాల మార్పు, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తదితర సమస్యలు వీటిలో వున్నాయి. ఈ అంశాలపై వారికి సిఎండి శివశంకర్ లోతేటి సమాధానమిస్తూ వినియోగదారుల సమస్యలను త్వరిత గతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీర్ఘకాలిక విద్యుత్ సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే, సాధ్యాసాధ్యాలను పరిశీలించి, వీలైనంత త్వరగా వాటిని పరిష్కరించేందుకు చర్యలు

2 లో

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 29 వినతులు

విశాలాంధ్ర-తిరుపతి: నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 29 వినతులు వచ్చాయని కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. సోమవారం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 21 మంది కార్యాలయంకు నేరుగా వచ్చి వినతులు సమర్పించగా, ఎనిమిది మంది ఫోన్ ద్వారా తమ సమస్యలు తెలిపారు. తమ వార్డుల్లో సమస్యలు పరిష్కరించాలని డిప్యూటీ మేయర్లు ముద్ర నారాయణ, ఆర్.సి. మునికృష్ణ, కార్పొరేటర్ దూది కుమారి లు కమిషనర్ ను కోరారు. కాగా వర్షాల సమయంలో అత్తూరు డాబా ఎదురుగా రోడ్డు పై నిలిచినా నీటిని తమ పొలంలోకి మళ్ళిస్తున్నారని, ఈ ఇబ్బందిని తొలగించాలని, న్యూ బాలాజీ కాలనీలో అనుమతులు లేకుండా చేస్తున్న నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని, వృద్ధాప్య పింఛన్ ఇప్పించాలని, మెప్మా నిర్వహిస్తిన్నా పొదుపు సంఘాల పుస్తకాలు కొనుగోలు, సభ్యత్వాల రుసుముకు రిసిప్ట్ ఇవ్వకుండా అవినీతికి పాల్పడుతున్నారు చర్యలు తీసుకోవాలని, సుభాష్ నగర్ నందు సిసి రోడ్లు, కాలువలు వేయాలని, అశోక్ నగర్ గంగమ్మ గుడి వద్ద త్రాగునీటిలో మురుగు నీరు కలుస్తున్నాయి అరికట్టాలని, అక్కారంపల్లి మునిసిపల్ స్కూల్ నందు బోరు మోటార్ మరమ్మతులు చేయించాలని, భూగర్భ డ్రైనేజి లీకేజి లను అరికట్టాలని, వివి మహల్ రోడ్డు డివైడర్ల మధ్య ఖాళీ స్థలం ఫిల్ చేయాలని కోరారని తెలిపారు. ఆయా సమస్యలను అధికారులకు పంపామని త్వరగా పరిష్కరించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డిసిపీ ఖాన్, రెవిన్యూ అధికారులు సేతుమాదవ్, రవి, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు, వెటర్నరీ ఆఫీసర్ గుణశేఖర్, డి.ఈ.లు, ఏసీపీ లు, శానిటరీ సూపర్ వైజర్లు, తదితరులు ఉన్నారు.

పద్మావతి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి ఆనం

విశాలాంధ్ర-తిరుపతి: తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని సోమవారం రాష్ట్ర ప్రభుత్వం తరపున దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిం చారు. ఆలయానికి చేరుకున్న మంత్రివర్యులకు టిటిడి జేఈవో వి.వీరబ్రహ్మం, డిప్యూటీ ఈవో హరీంధ్రనాథ్, ఆలయ అర్చకులు, అధికారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం ప్రసాదాలు అందజేశారు. అనంతరం మంత్రివర్యులు మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించడం తన అదృష్టంగా భావిస్తున్నట్టు చెప్పారు. ఈ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ, సిఎం చంద్రబాబు ఆలోచనల మేరకు టిటిడి ఆలయాల్లో అన్నప్రసాదాలు పంపిణీకి చర్యలు చేపట్టామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆలయాలకు భక్తుల సంఖ్య పెరుగుతోందని, అందుకు తగ్గట్టుగానే చర్యలు చేపట్టామన్నారు. తిరుచానూరు బ్రహ్మోత్సవాల్లో పంచమి తీర్థం రోజున దాదాపు 50 వేలకు పైగా భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని, పటిష్ట చర్యలు చేపట్టాలని సూచించామన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తుల కోసం టీటీడీ అన్ని వసతులు కల్పించిందన్నారు. ఈ నెల 20, 21 తేదీల్లో రాష్ట్రపతి గౌరవనీయులు ద్రౌపది ముర్ము తిరుచానూరు, తిరుమలలో శ్రీ పద్మావతీ అమ్మవారిని, శ్రీవారిని దర్శించుకునేందుకు వస్తున్నారని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో విజివో గిరిధర్, ఏవీఎస్వో రాధాకృష్ణ మూర్తి, టిటిడి ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ రమేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలు

(మొదటి పేజీ తరువాయి) పుష్పప్రదర్శన బాగా ఉందని, బ్రహ్మోత్సవాలకు తరలి వచ్చే భక్తులతో పాటు స్థానికులు కూడా సందర్శించాలని ఈవో కోరారు. ఇదిలా ఉండగా రాత్రి 7 నుండి 9 గంటల వరకు శ్రీ పద్మావతి అమ్మవారు చిన్న శేష వాహనంపై నాలుగు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనం ఇస్తారు.

విశేష స్పందన

(మొదటి పేజీ తరువాయి) చేపడుతామని వివరించారు. గతంలో 'డయల్ యువర్ సిఎండి' ద్వారా తమ దృష్టికి వచ్చిన సమస్యలలో అధిక శాతం సమస్యల్ని ఇప్పటికే పరిష్కరించామన్నారు. సాంకేతికపరమైన అడ్డంకులున్నవి మాత్రమే పెండింగులో వున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారానే కాకుండా వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్లు: 1912 లేదా 1800 425 155333కు కాల్ చేయడం లేదా వాట్సాప్ నంబరు: 91333 31912కు చాట్ చేయడం ద్వారా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ఐటి) పి. అయూబ్ ఖాన్, డైరెక్టర్ (టెక్నికల్ అండ్ హెచ్ఆర్డి) కె.గురవయ్య, డైరెక్టర్/ ఫైనాన్స్ (ఎఫ్ఎసి) కె. రామమోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు పి. హెచ్. జానకి రామ్, జె. రమణా దేవి, ఎన్. శోభావాలెంటీనా, కె. ఆదిశేషయ్య, యం. మురళీకుమార్, పి. సురేంద్ర నాయుడు, జనరల్ మేనేజర్లు చక్రపాణి, రాజశేఖర్ రెడ్డి, సురేంద్ర రావు, బాస్కర్ రెడ్డి, ప్రసాద్, వెంకట రాజు, విజయన్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవల్మీకేశ్వరస్వామికి వెయ్యి లీటర్ల పాలతో మహాభిషేకం

విశాలాంధ్ర-తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం, దుర్గసముద్రం గ్రామంలో కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా దుర్గసముద్రం గ్రామానికి చెందిన సంఘమిత్ర లీడర్ సిద్దమ్మ ఘనమైన ధార్మిక కార్యక్రమం నిర్వహించారు. శ్రీవల్మీకేశ్వర స్వామివారికి 1000 లీటర్ల పాలు సమర్పించి మహాభిషేకం నిర్వహించడం విశేషంగా మారింది. కార్తీక సోమవారం సందర్భంగా భక్తి శ్రద్ధలతో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామస్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. పాలాభిషేకం అనంతరం ప్రత్యేక పూజలు,హారతులు నిర్వహించగా దేవాలయం పరిసరాల్లో శోభాయమానమైన వాతావరణం అలముకుంది. సిద్దమ్మ మాట్లాడుతూ గ్రామ శాంతి, ప్రజల సుఖశాంతుల కోసం ఈ అభిషేకం నిర్వహించినట్లు తెలిపారు. గ్రామ ప్రజలు సిద్దమ్మ సేవాభావాన్ని ప్రశంసించారు.

నందీశ్వరునికి ఘనముగా అభిషేకం..

విశాలాంధ్ర-పూతలపట్టు: పూతలపట్టు నియోజకవర్గం ఐరాల మండలం, స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానం అనుబంధ దేవాలయం అయిన శ్రీ మరగదాంబిక శ్రీ మణికంఠేశర దేవాలయము నందు కార్తీకమాసం సందర్భంగా మణికంటేశ్వర స్వామి ఆలయములో సోమవారం ఉదయం నందీశ్వరునికి ఘనముగా అభిషేకము చేసి వివిధ రకాల పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనం ఏర్పాట్లు చేసిన అర్చకులు మహిళభక్తులుకార్తీక మాసం సందర్భంగా అధిక సంఖ్యలో వచ్చి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

అడపారెడ్డిపల్లిలో 'నాకోసం కాదు- సమాజ సేవ కోసం'

విశాలాంధ్ర-తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం, అడపారెడ్డిపల్లిలో ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాల తిరుపతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ప్రత్యేక శిబిరం ప్రారంభోత్సవ సభను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త, కో-ఆర్డినేటర్ డా. ఎ. రామకృష్ణారావు, మండల వ్యవసాయ అధికారి ఏ.వి. సుబ్బారావు, ఎన్ఎస్ఎస్ అధికారి డా. ఎన్. సబిత, ఏడీ ప్రతినిధి డా. సి. నాగమణి పాల్గొని జ్యోతి ప్రజ్వలనతో శిబిరాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథి డా. రామకృష్ణారావు మాట్లాడుతూ విద్యార్థుల్లో సామాజిక బాధ్యత, సేవా మనస్సు, నాయకత్వ లక్షణాలు పెంపొందించడంలో ఎన్ఎస్ఎస్ ఎంతో ముఖ్యమని చెప్పారు. పరిశుభ్రత, ఆరోగ్యం, విద్య వంటి ప్రజాసేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. గ్రామ సమస్యలను అర్థం చేసుకుని వాటికి పరిష్కార మార్గాలు అన్వేషించడంలో శిబిరం గొప్ప అనుభవాన్ని అందిస్తుందని అన్నారు. మండల వ్యవసాయ అధికారి ఏవి సుబ్బారావు మాట్లాడుతూ జాతీయ సేవా పథకంలో విద్యార్థులు చేరడం గ్రామీణాభివృద్ధికి దోహదం చేస్తుందని పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ అధికారి డా.సబిత మాట్లాడుతూ ఏడురోజులపాటు అడపారెడ్డిపల్లి గ్రామంలో శిబిరం నిర్వహించనున్నామని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో, సేవా స్ఫూర్తితో గ్రామాభివృద్ధికి పనిచేయాలని సూచించారు. ఎడీ ప్రతినిధి డా. సి. నాగమణి మాట్లాడుతూ విద్యార్థులు గ్రామ ప్రజలతో మమేకమై వారి అవసరాలను అర్థం చేసుకుని సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, రైతులు, గ్రామస్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

చెరువు పునరుద్ధరణ చేసి రైతులను ఆదుకోండి

విశాలాంధ్ర-తిరుపతి కలెక్టరేట్: కేవీబీపురం మండలంలోని పోతపాళెం గ్రామానికి పరిసరాల్లో ఉన్న రాయల్ చెరువుకు ఈనెల 6న గండి పడడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చెరువు నీరు ఒక్కసారిగా వెళ్లిపోవడంతో ఈ రబీ సీజన్‌లో పంటలు సాగు చేసే అవకాశమే ప్రశ్నార్థకంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. చెరువు పునరుద్ధరణ పనులను శరవేగంగా చేపట్టకపోతే పంటల సాగు అసాధ్యమై, రైతులు అప్పుల బారం లోకి జారుకునే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. భారీ నష్టం వాటిల్లే అవకాశం ఉన్నందున వెంటనే చెరువు మరమ్మతి చేసి పూర్వవైభవం చేకూర్చాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో రైతులు కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేసి, అనంతరం తమ సమస్యలను వివరించేలా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

లచ్చ మయ్యు ఊరికి చెందిన బెల్లం నిఖిల్

విశాలాంధ్ర-పూతలపట్టు: పూతలపట్టు నియోజక వర్గం వావిల తోట పంచాయతీ లక్ష్మయ్య ఊరికి చెందిన బెల్లం నిఖిల్ ప్రమాదవశాత్తు మరణిం గా వారి కుటుంబ సభ్యు లను పరామర్శించిన పూతలపట్టు శాసనస భ్యులు కలికిరి మురళీమోహన్... ఈ కార్యక్రమంలో పూతలపట్టు, తవణంపల్లి, ఐరాల, బంగారుపాలెంకు చెందిన కన్వీనర్లు దొరబాబు చౌదరి, హరిబాబు నాయుడు, వెంకటేశ్వర చౌదరి, ధరణి ప్రసాద్, ఏఎంసీ భాస్కర్ నాయుడు, గంగారపు గోపి, పూతలపట్టు మాజీ అధ్యక్షులు చంద్రమౌళి, తదితర టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పాకాల గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమకారుల సంస్మరణ సభ

విశాలాంధ్ర-పాకాల: స్థానిక పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా సోమవారం గ్రంథాలయ ఉద్యమకారుల సంస్మరణసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాల ఉద్యమకారులు ఎస్ఆర్ రంగనాథం, అయ్యంకి వెంకటరమణయ్య ,పాతూరి నాగభూషణం, గాడి చర్ల హరిసర్వోత్తమరావు, వెలగా వెంకటప్పయ్య లకు ఘన నివాళులు అర్పించారు. గ్రంథాలయాల స్థాపనకు వారు చేసినటువంటి కృషి ని కొనియాడారు. స్వాతంత్ర ఉద్యమంలో వీరు ఎంతో కృషి చేసి గ్రంథాలయాలను స్థాపించి వాటి ద్వారా విషయాలన్నీ కూడా ఆ ఉద్యమకారులకు చేరవేసి ప్రజలలో చైతన్యం తీసుకొని వచ్చి స్వాతంత్రం పోరాటానికి తన వంతు కృషి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాల అధికారి రవీంద్రబాబు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మాసలామణి, అధ్యాపకులు ఆది శేఖర్ రెడ్డి, చిట్టి కళావతి, డిగ్రీ కళాశాల విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

పద్మావతి అమ్మవారి చిన్న శేష వాహనసేవ



రాజాను సన్మానించిన టిడిపి నాయకులు

విశాలాంధ్ర-కార్వేటినగరం: మండల పరిధిలోనే కొల్లగుంట స్వగ్రామంలో స్థానిక ఎమ్మెల్యే సోదరులు నూతనంగా మండల ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన రాజాను గంగాధరం, సోమశేఖర్ యాదవ్, ధనంజయ రాజు, రాజేందర్ రెడ్డి, సోము, మద్దూరు సుబ్రహ్మణ్యం యాదవ్, లు పూలమాలవేసి సాల్వ్ కప్పి ఘనంగా సన్మానించారు.

టిడిపి సంస్థాగత ఎన్నికలకు తరలిన టిడిపి నేతలు

విశాలాంధ్ర-పుంగనూరు: పట్టణం మరియు మండల పరిధిలోని గ్రామ కమిటీలు వార్డు కమిటీలు పట్టణ అధ్యక్షులు మండల అధ్యక్షులు ఎన్నిక ప్రక్రియ కోసం సంస్థాగత ఎన్నికలను పార్టీ అధిష్టానం పరిశీలకుల ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని రొంపిచర్ల నందు ఒక కళ్యాణ మండపంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీకాంత్ మండల అధ్యక్షులు మాధవరెడ్డి మాజీ కౌన్సిలర్ ఇబ్రహీం నాయకులు షామీర్ ఆధ్వర్యంలో తెలుగు తమ్ముళ్లు తరలి వెళ్లడం జరిగింది. ఎన్నికల్లో తమ అభిప్రాయాలను తెలిపి పార్టీని పటిష్టం చేసి రాబోయే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేసే నాయకుల్ని ఎన్నుకోవడమే లక్ష్యంగా మేము ఎన్నికలకు వెళ్లడం జరిగిందని వారు పేర్కొన్నారు.

విద్యార్థుల భద్రత - భవిష్యత్ రక్షణ పై అవగాహన

విశాలాంధ్ర-తిరుపతి: విశ్వం హై స్కూల్, జీవకోన ప్రాంగణంలో సోమవారం మహిళా పోలీస్ స్టేషన్ ఎస్.ఐ. కుళ్లయ్యప్ప ప్రధాన అతిథిగా పాల్గొనగా,మహిళా విభాగ ఏఎస్ఐ రోహిణి,హెడ్ కానిస్టేబుల్ పి.సుశీల, కానిస్టేబుల్లు కె.స్వప్న, జి.నీరజ తదితరులతో కలిసి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యంగా చదువు వల్ల వ్యక్తిత్వ వికాసం,సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న మోసపూరిత చర్యలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ ప్రమాదాలు, జాగ్రత్తలు, టీనేజ్ వయస్సులో ఎదురయ్యే ఆకర్షణలు, వాటిని నియంత్రించనప్పుడు వచ్చే ప్రతికూల పరిణామాలు,వాస్తవ సంఘటనల ఆధారంగా కేస్ స్టడీస్, ప్రవర్తనలో ఆదర్శం, తల్లిదండ్రులకు అనవసర ఆర్థిక ఇబ్బందులు కలిగించకూడదనే సందేశం,చిన్న చిన్న విషయాలకు గొడవలు నివారించాలనే సూచన,ఉద్యోగాల కోసం వెతికే సమయంలో జరుగుతున్న సైబర్ మోసాలు,అవసరం లేకుండా వాడుతున్న లోన్ యాప్‌ల వల్ల నేరాలు,శక్తి అప్లికేషన్ వినియోగం,అత్యవసర సేవల నంబర్లు గురించి విద్యార్థులకు విపులమైన అవగాహన కల్పించారు.విశ్వం విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్. విశ్వనాథ రెడ్డి మాట్లాడుతూ "టెక్నాలజీ మరియు సోషల్ మీడియా వేగంగా మారుతున్న ఈ కాలంలో, విద్యార్థులు భద్రతా విషయాలపై అవగాహన కలిగి ఉండటం అత్యంత అవసరం. ఇలాంటి కార్యక్రమాలు వారి ఆలోచనలను మెరుగుపరచి, జీవితాన్ని సురక్షిత దిశగా నడిపిస్తాయి. మా విద్యార్థుల భవిష్యత్ కోసం విశ్వం సంస్థ ఎల్లప్పుడూ ఇలాంటి కార్యక్రమాలను ప్రోత్సహిస్తుందని తెలిపారు.

మృత్యుంజయస్వామికి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి:

శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మృత్యుంజయస్వామి కి సోమవారం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గణపతిపూజ, కలశ స్థాపన పూజలు చేశారు. అనంతరం స్వామివారికి చందనం, నారికేళ్ల, పసుపు, కుంకుమ, విభూథి వంటి వాటితో అభిషేకాలు చేశారు. అనంతరం సుందరంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలకు వేతనం మంజూరు చేయాలి

విశాలాంధ్ర-తొట్టంబేడు: మండలంలోని ఉపాధి హామీ కూలీలకు పెండింగ్లో ఉన్న వేతనాలు మంజూరు చేయాలని సీపీఐ నాయకులు ఏపీఓ కళ్యాణికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు మించల శివకుమార్, రుద్రపాకు శ్రీనివాసులు మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీలు పనులు చేసి మూడు నెలలు కావస్తున్న ఈనాటికీ కూలీలకు చేసిన పనికి ఇంతవరకు అందలేదని మండిపడ్డారు. కూలీలు వేతనాల కోసం పడి కాపులు కాస్తున్నారని ఉపాధి హామీ కూలీలు కుటుంబాలు వీధిన పడే పరిస్థితి దాపరించిందని ఆవేదన వ్యక్తం చేశారు. పని జరిగే చోట మౌలిక సదుపాయాలు కల్పించాలని రెండు వందల రోజులు పని దినాలు కల్పించి రోజుకు రూ.600 కేంద్ర ప్రభుత్వం అందజేయాలని కోరారు, అదేవిధంగా జాబ్ కార్డులకు అతీతంగా పనులు కల్పించి వలస నివారణ అరికట్టాలని వారికి పనిముట్లు కల్పించి సంవత్సరములు కావస్తున్న పనిముట్లు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని వెంటనే పెండింగ్లో ఉన్న కూలీలకు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పరశు రామయ్య సుబ్బమ్మ లక్ష్మి మల్లేశ్వరమ్మ మన్నెమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తీరిన నీటి సమస్య

విశాలాంధ్ర-గంగాధర నెల్లూరు: మండలంలోని తూగుండ్రం పంచాయతీ, తూగుండ్రం ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో ఎమ్మెల్యే డాక్టర్ థామస్ ఆదేశాలతో జడ్పీ, ఎంపీపీ నిధులు సహకారంతో కొత్త బోరు మోటర్ ఏర్పాటుచేసి సోమవారం లాంఛనంగా పూజా కార్యక్రమం నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా పెనుమూరు మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణ నాయుడు మాట్లాడుతూ సంక్షేమం అభివృద్ధి కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. స్థానిక పి హెచ్ డాక్టర్లు ప్రవీణ్, మౌనిక డాక్టర్లను అభివృద్ధి కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ నియాజ్ అలీ, జిల్లా టిఎన్టియుసి అధికార ప్రతినిధి జీవరత్నం, మాజీ పిహెచ్సి చైర్మన్ నరసింహనాయుడు, జిల్లా క్రిస్టియన్ సెల్ కార్యదర్శి శాంత కుమార్, గ్రామ కమిటీ అధ్యక్షుడు నీరజాక్షలు రెడ్డి, సీనియర్ టిడిపి నాయకుడు బాబు నాయుడు,మండల బీసీ సెల్ ఉపాధ్యక్షుడు రాఘవేంద్ర, మండల మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి అతేహర్ అలీ, పంచాయతీ సెక్రెటరీ శిరీష, నాయకులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి

విశాలాంధ్ర-కార్వేటినగరం: ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల తక్షణమే పరిష్కరించారని తాసిల్దార్ నాగరాజు, ఎంపీడీ వో చంద్రమౌళి ఒక ప్రకటనలు తెలిపారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడుతూ ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. తాసిల్దార్ కు 7 ఫిర్యాదులు వచ్చిందని దాంట్లో రెండు పరిష్కరించడం మిగిలిన ఐదు వారం లోపల పరిష్కరించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిటి లోకేష్ యాదవ్, ఆర్ ఎస్ డి టి స్వరూప రాణి, సర్వేర్ మార్కండేయులు మండల, ఆర్ ఐ నరసింహులు వీఆర్వోలు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

విశాలాంధ్ర-చంద్రగిరి: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని విశ్రాంత అధ్యాపకులు శంకరరాజు అన్నారు. చంద్రగిరి శాఖా గ్రంథాల యంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సోమవారం జరిగిన కవి సమ్మేళనానికి ముఖ్య అతిథిగా విశ్రాంత పీలేరు అధ్యాపకుడు శంకర రాజు, స్థానిక గురుస్వామి పాల్గొన్నారు. శంకరరాజు గ్రంథాలయాల గురించి, గ్రంథా లయ ఉద్యమకారుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వక్తలును గ్రంథాలయ అధికారిణి రెడ్డమ్మ సన్మానించారు. స్థానిక ప్రతిభ పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారికి బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో పాఠకులు, పురప్రజాలు, ప్రతిభ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, రమాదేవి పాల్గొన్నారు.

చంగల్ రాయ యాదవ్‌కు సన్మానం

విశాలాంధ్ర-కార్వేటి నగరం: కార్వేటి నగరం మండల టిడిపి పార్టీ అధ్యక్షులుగా నూతనంగా ఎన్నికైన చంగల్ రాయ యాదవు ను వారి స్వగ్రామమైన కృష్ణాపురంలో సోమవారం టిడిపి నాయకులు సాలువు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ టిడిపి పార్టీ బలోపేతానికి కృషి చేయాలి అన్నారు. ఈ కార్యక్రమంలో సోమశేఖర్ యాదవ్, ధనుంజయ రాజు, మునిరాజు, సోము, రాజేంద్ర రెడ్డి, హేమంత్ రెడ్డి, లక్ష్మణ రాజు, గంగాధరం వెంకటేష్ మద్దూరుసుబ్రహ్మణ్య యాదవ్, తదితరులు ఉన్నారు.

వినాయక స్వామి ఆలయ కుంభాభిషేకంలో పాల్గొన్న ఎమ్మెల్యే నాని

విశాలాంధ్ర-చంద్రగిరి: చంద్రగిరి మండలం, కాశిపెంట్ల పంచాయితీ దిగువ కాశిపెంట్ల గ్రామంలో ఆలయ నిర్మాణం పూర్తి చేసుకున్న సందర్భంగా శ్రీ వినాయక స్వామి ఆలయ కుంభాభిషేకం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ కుంభాభిసేకంకు గ్రామ పెద్దలు, గ్రామస్థులు ఎమ్మెల్యే పులివర్తి నానిని ప్రత్యేక ఆహ్వానం పలికారు. సోమవారం దిగువ కాశిపెంట్ల గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యే పులివర్తి నానికి మహిళలు హారతులు పట్టి తిలకం దిద్ది ఘన స్వాగతం పలికారు. యువత బాణాసంచాతో, డప్పుల మోతలతో గ్రామంలో హెూరెత్తించారు. ఆలయం వద్దకు చేరుకున్న ఎమ్మెల్యేకి అర్చకులు, గ్రామ పెద్దలు పూర్ణకుంభ స్వాగతం పలికారు. వినాయక స్వామి కి ఎమ్మెల్యే పులివర్తి నాని పట్టువస్త్రాలు సమర్పించి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలో పాల్గొని స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పూజారి ఎమ్మెల్యే పులివర్తి నాని ని దీవించారు. అనంతరం ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ శ్రీ వినాయక స్వామి ఆలయ కుంభాభిసేకంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. దిగువ కాశిపెంట్ల గ్రామంలోని సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. చెరువుకు మొరవ పారే కాలువ గత వైసిపి పాలనలో కోతకు గురవడంతో అప్పటి నాయకులు యంత్రాంగం పట్టించుకోలేదని రైతులు ఎమ్మెల్యేకి ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన ఇరిగేషన్ అధికారులను త్వరితగతిన సమస్యను పరిష్కరించి చెరువు నీరు పొలాల పైకి వెళ్లకుండా చర్యలు చేపట్టాలని అధికారులు ఆదేశించారు. చిన్న పిల్లలు, యువత, గ్రామస్థులు, పెద్దలు,ప్రజలు ఆయుఆరోగ్యలతో , అష్టఐశ్వర్యాలతో, సుఖ సంతోషాలతో, పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని వినాయక స్వామి వారిని కోరుకున్నట్లు నాని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి ప్రభుత్వం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

మత్తుకు యత్నిస్తే ఖబడ్దార్

సిఐ సురేష్ కుమార్

విశాలాంధ్ర-చంద్రగిరి: ఆకతాయి పోకడలతో ఎవరైనా మత్తుకు యత్నిస్తే ఉక్కుపాదంతో తొక్కిపడేస్తానంటూ చంద్ర గిరి సిఐ సురేష్ కుమార్ హెచ్చరించారు. గత కొన్నేళ్లుగా చంద్రగిరి మండలంలో కొంత మంది మత్తుకోసం నానారకాలుగా పెడదోవ పడుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటి అసాంఘిక చర్యలను కూకటి వేళ్లతో పెకలించడానికి ప్రత్యేక బృందాలతో నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చంద్రగిరి మండలంలో ఎవరైనా గంజాయి కలిగి వుండటం, వినియోగిం చడం, విక్రయించడం వంటి చర్యలకు పాల్పడితే నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని తేల్చిచెప్పారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం చట్టరీత్యా నేరమ న్నారు. ఆ మేరకు ఎవరైనా పట్టుపడితే కటకటాలు తప్పవని స్పష్టం చేశారు. కొంత మంది పోకిరి చేష్టలతో నిషేధిత ఉత్ప్రేరికాలను మత్తు కోసం వినియోగిస్తున్నట్లు సమాచారం వుందన్నారు. ఇటువంటి వారు పట్టుబడితే తీవ్రపరిణామాలు ఎదుర్కొనక తప్పని హెచ్చరించారు. ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లల దినచర్యలపై ప్రత్యేక దృష్టి కలిగి వుండాలన్నారు. మత్తుకు బానిసలు కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే అన్నారు. మత్తుకు బానిసలై అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే తగిన గుణపాఠం చెబుతానని స్పష్టం చేశారు.

చట్టాలపై అవగాహన

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: పట్టణంలోని భరద్వాజతీర్థంలో గల కంచికామకోటి వృద్ధాశ్రమంలో సోమవారం న్యాయవిజ్ఞాన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి శ్రీకాళహస్తి న్యాయస్థాన అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జీ కృష్ణప్రియ హాజరయ్యారు. ఆశ్రమంలో వసతులపై అధికారులను అడిగితెలుసుకునానరు. వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా న్యాయ మూర్తి మాట్లాడుతూ వృద్ధులకు సంబంధించిన పెన్షన్లు, ఉచిత న్యాయం గురించి వివరించారు. ఏ సమస్య ఉనాన అర్జీరూపంలో ఇస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. న్యాయ సలహాలకు 15100ను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు, కోర్టు సిబ్బంది, వృద్ధులు తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ ఆద్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి సోమవారం విజయవాడకు చెందిన దొన్నేనూడి నాగేంద్రబాబు దంపతులు రూ.1,01,116ను విరాళంగా అందజేశారు. ఈ సొమ్మును ఈవో బాపిరెడ్డి స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. వారికి అంతరాలయ దర్శన ఏర్పాట్లు చేశారు. వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మూగ జీవాల వైద్యంపై నిర్లక్ష్యం

- రోగాల బారిన పడి పశువుల మృత్యువాత
- ఆర్థికంగా నష్టపోతున్న రైతులు
- అనుపత్రులు ఉన్నా వైద్యులు, సిబ్బంది కరువు

విశాలాంధ్ర-బాలాయపల్లి: మన భారతీయ సంస్కృతిలో పశువులతో పాటు సమస్త ప్రాణకోటికి ఎంతో విలువ ఉంది. ప్రధానంగా వ్యవసాయ రంగంలో ముఖ్య భూమిక పోషించే పశువులుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించి పశువులకు వైద్యం అందించేందు కు పశుసంవర్ధక శాఖ ఏర్పాటు చేయడం జరిగింది. అయితే మన రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి కారణంగా పశువుల కోసం ఏర్పాటు చేసి ఉన్న పశుసంవర్ధక శాఖ సేవలు అధ్వానంగా ఉన్నాయని పాడిపశువుల రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని బాలాయపల్లి, చిలమనూరు, జయంపు గ్రామాల్లో పశువైద్య కేంద్రాలు ఉండగా ఏ ఒక్క పశువైద్యశాలలో పశువైద్యులు లేకపోవడం విశేషం. గత రెడేళ్లు గా జయంపు కేంద్రంలో పశువైద్యాధికారి లేకపోగా చిలమనూరు పశువైద్యశాల వైద్యాధికారి దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. బాలాయపల్లి పశు వైద్యాధికారి ఇటీవల జరిగిన బదిలీల్లో నెల్లూరు జిల్లా సైదాపురం కు బదిలీపై వెళ్లారు.. దీంతో ఆయా పశువైద్య కేంద్రాలకు ఇన్చార్జిలను నియమించారు. ఇన్చార్జిలుగా నియమితులైన పశువైద్యులు ఎప్పుడు వస్తారో ఎప్పుడు వెళతారో తెలియని పరిస్థితి. దీంతో పాడిపశువులు, మూగజీవాలు కలిగిన రైతులు పశు వైద్యం కోసం ప్రయివేటు వ్యక్తులకు డబ్బులు చెల్లించి పశువులకు వైద్యం చేయించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. పశువులు రైతులకు వ్యవసాయంలో చేయూతనందించడంతో పాటు వాటి పాల ద్వారా రైతుల కుటంబాల జీవణాదారంగా ఉన్నాయి. వ్యవసాయంలో యాంత్రీకరణ ప్రాదాన్యత చోటు చేసుకున్నా పశువుల పాత్ర తగ్గినా కూడా పశువులు రైతులకు జీవణాదారంగా మారాయి. ఈ క్రమంలో వేలాదిమంది రైతులు పశువుల ఆధారంగా జీవనం సాగిస్తున్నారు. బాలాయపల్లి మండలంలో గేదెలు. గొర్రెలు, మేకలు, ఆవులు అత్యదికంగా ఉన్నాయి. ఈ ప్రాంతంలో సాగునీరు లేక ఒక్క పంట కూడా పండించలేని పరిస్థితులలో కూడా రైతులు పాడి పశువుల పై ఆధారపడి జీవిస్తున్నారని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. గత ప్రభుత్వం గ్రామ సచివాలయాల ద్వారా రైతులకు సేవలందించేందుకు ఆర్బికే లను నెలకొల్పింది. అయితే 15 రైతు భరోసా కేంద్రాలకు గాను 9 రైతు భరోసా కేంద్రాలకు మాత్రమే పశుసంరక్షణ అసిస్టెంట్ లను నియమించారు. అటు వైద్యులు. ఇటు సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ప్రతి ఏటా పలు రోగాల బారీన పడి పశువుల, గొర్రెలు, మేకలు వందలాది చనిపోతున్నాయి. దీంతో రైతులు లక్షల రూపాయలు నష్టపోతున్నారు. సచివాలయాల పరిదిలో ఉన్న పశుసంరక్షణ అసిస్టెంట్లతో పాటు ఆయా పశువైద్యశాలలో ఉన్న సిబ్బంది ఎప్పుడు వస్తారో ఎప్పుడు వెలతారో ఎవ్వరికి తెలియని పరిస్థితి నెలకొంది. కనీసం ఇన్ చార్జిలు సైతం లేకపోవడ తో పర్యవేక్షణ లోపడి ఎవరికి వారే ఎమునా తీరే అన్న చందాన సచివాలయాల పశుసంరక్షణ అసిస్టెంట్లు, పశు వైద్య సిబ్బంది చుట్టపు చూపుగా అలా వచ్చి వెళ్లడం ఆనవాయితీగా మారిందని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఒకవేల సిబ్బంది ఎవరైనా అందుబాటులో ఉండి వైద్యం చేసేందుకు వస్తే డబ్బులు ఇచ్చేవరకు వదలకుండా పీడిస్తున్నారని పలువురు రైతులు వాపోతున్నారు. ఇకనైనా ఉన్నతాదికారులు స్పందించి బాలాయపల్లి పశువైద్య కేంద్రాలపై దృష్టి సారించి పశు రైతులను ఆదుకోవలని కోరుతున్నారు.

ఘనంగా కవి సమ్మేళనం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో ముఖ్య అతిథిగా ప్రముఖ కవి, రచయిత, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ సభ్యులు డాక్టర్ వి. ఆర్. రాసాని పాల్గోన్నారు. ఆయన మాట్లడుతూ పుస్తకం ఎపుడూ ఓక తండ్రిగా గురువుగా మనకు ఉపదేశం ఇస్తుందని మంచి పౌరుడుగా ఎదగాలంటే పుస్తకాలు చదవాలి అని ఎపుడైతే ఎక్కవ పుస్తకాలు చదువుతారో వారు తప్పక ఉన్నత స్థానానికి చేరుకుంటారని తెలిపారు. రచయిత డాక్టర్ ఉమాదేవి, శివ ప్రసాద్ గ్రేడ్ 1 గ్రంథాలయ అధికారి, తిరుపతి వారు ఈ కార్యక్రమమునకు ఆత్మీయ అతిథులుగా విచ్చేసారు. ఈ కార్యక్రమములో కవులు తీగల వెంకయ్య, ముని సుబ్బారెడ్డి, గురునాథం, షణ్ముఖం, శ్రీనివాసులు పాల్గొని కవితలు గేయాలు ఆలపించిరి గ్రంథాలయ అధికారులు లావణ్య, హరిక్రిష్ణ, పాఠకులు మరియు విద్యార్థులు పాల్గొనారు.

ఈ క్రాప్ నమోదుపై అవగాహన

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: మండలంలోని టీఎంవీకండ్రిగలోని రైతు సేవా కేంద్రంలో ఈ క్రాప్ నమోదుపై విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ భాస్కర్‌నాయక్ అవగాహనకల్పించారు. ఆయన మాట్లాడుతూ ఈ క్రాప్ నమోదు వల్ల ప్రభుత్వం ఇచ్చే రాయితీలు, బ్యాంకు రుణాలు, రైతు గిట్టుబాటు ధర మరియు ధాన్యం కొనుగోలు సమయంలో ఉపయోగ పడుతుందన్నారు. గ్రామాల రైతులు పేర్లు రైతు సేవాకేంద్రం నందు నోటీసు బోర్డు నందు ప్రధర్శించామని తెలిపారు, అందులో ఏదేని పేర్లు, విస్తీర్ణం, ఆధార్ నెంబర్ వంటి తప్పిదాలు ఉంటే రేపు నెల 17 వరుకు అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ఎంపీపీ దొరైరాజ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఈశ్వరరెడ్డి, కృష్ణమనాయుడు, మునిశంకర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

హరిహరనాదులను యధాశక్తిగా పూజిద్దాం- జన్మరాహిత్యం పొందుదాం

రాస్ ప్రధాన కార్యదర్శి డా. ఎస్.వెంకటరత్నం

విశాలాంధ్ర-తిరుపతి: రాష్ట్రీయ సేవా సమితి (రాస్) ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ వెంకటరత్నం సూచనల మేరకు తిరుపతి కార్పొరేషన్ పరిధిలోని స్థానిక బొమ్మగుంటలోని శ్రీ పద్మావతి ప్రార్థన మహిళా మండలిలో చిన్నగుంట మహిళలతో కార్తీక మాస పూజ మహొత్సవమును పురస్కరించుకొని సోమవారం అత్యంత భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా, హరిహరనామ స్మరణతో, వేద పండితుల మంత్రాలతో, భక్తి పారవశ్యంతో , ఉపవాసంతో పూజా కార్యక్రమాన్ని 400 మంది మహిళలతో నిర్వహించి ఉసిరి దీపాలను వెలిగించి, సామూహిక దీపారాధన చేసి తమ శక్తిని ముక్తిని ఆధ్యాత్మికంగా శివనామస్మరణతో ఘనంగా చేశారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాస్ ప్రధాన కార్యదర్శి డా.ఎస్. వెంకటరత్నం మాట్లాడుతూ మహిళలందరూ లోకం కోసం సామూహికంగా కార్తీక మాసంలో శివారాధనకు ప్రత్యేకమైనది. భూలోకం వైకుంఠం ఓ వైపు హర హర శంకర మహాదేవ అంటూ అభిషేకాలతో మారుమోగుతుంటే మరొకవైపు శ్రీసత్యనారాయణ స్వామి వ్రతాలతో ఏకాదశి ఉపవాసాలతో విష్ణు సహస్రనామ పారాయణలతో భూలోకంలో వైకుంఠం తలపించేవిధంగా ఉంటుంది. ఇంతటి మహిమాన్వితమైన కార్తీకమాసాన్ని భక్తిశ్రద్ధలతో హరిహర నాధులను ఆరాధిస్తూ నియమ నిష్టలితాలతో ఉపవాసాలు, నది స్నానాలు, దీపారాధన, దానధర్మాలు చేస్తూ సకల భోగభాగ్యాలు అనుభవించి జన్మహైత్యాన్ని పొందవచ్చునని తెలియజేశారు. రాస్ పొదుపు సంఘాల ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.నాగరాజు మాట్లాడుతూ ఆర్థిక కార్యక్రమాల నిర్వహణే కాకుండా ఆధ్యాత్మికత వైపు మహిళలను ప్రోత్సహించి మంచి జీవన విధానాన్ని అందించడం రాస్ ధ్యేయమని అన్నారు. లింగ వివక్షత లేకుండా పిల్లలను బాగా చదివించాలని భవిష్యత్తులో వారు కుటుంబానికి ఇటు సమాజానికి ఉపయోగపడే విధంగా తల్లిదండ్రులు వారిని తీర్చిదిద్దాలన్నారు. అనంతరం చేతి కర్రలు, దుప్పట్లు, పంపిణీ చేశారు. పూజలో పాల్గొన్న మహిళలకు పూజానంతరం కంకణాలు, ప్రసాదాలు అందించారు. రాస్ సిబ్బంది నాగేశ్వర్, వాణి, కవిత, మంజుల, నాగరాజు, నాగవేణి తో పాటు మునిరత్నమ్మ, శంకుంతలమ్మ, లక్ష్మిదేవి తదితరులు పాల్గొన్నారు.

చెల్లేశ్వర స్వామికి అన్నాభిషేకం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణం పానగల్ లో వెలసిన చెల్లేశ్వర స్వామికి సోమ వారం అన్నాభిషేకం వేడుకగా జరిగింది. శ్రీకాళహస్తీశ్వరాలయా నికి అనుబంధంగా ఉన్న ఈ ఆలయంలో ఉదయం స్వామికి ప్రత్యేక అభిషేకం జరిగింది. ఆ తర్వాత వరి బియ్యంతో తయారు చేసిన అన్నంతో శివలింగాన్ని అర్చకులు కప్పేశారు. ఆ తర్వాత వివిధ రకాల కూరగాయలతో స్వామిని అలంకరించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

ఆర్టీఐ అడిగినందుకు దాడి

విశాలాంధ్ర-తిరుపతి కలెక్టరేట్: తిరుపతి జిల్లా, పుత్తూరు మండల, పాతపాళెం గ్రామానికి చెందిన రైతులు సోమవారం కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించారు. పుత్తూరులోని చెన్నై శరవణ ఐ క్లినిక్‌పై ఆర్టీఐ ద్వారా సమాచారం అడిగినందుకు తమపై దాడులు జరిగాయని కే.మురగారెడ్డి ఆరోపించారు.
ఈ సందర్భంగా మురగారెడ్డి మాట్లాడుతూ.. పుత్తూరులో ప్రభుత్వ అనుమతి లేని క్లినిక్ నడుపుతూ అడిగిన వారిపై దాడి చేస్తున్న ఈడి కవితారాణిపై చర్యలు తీసుకోవాలని, దాడిని ప్రేరేపించిన పిఐఓని సస్పెండ్ చేయలని, ఆస్పత్రి ఈడీ కవితారాణి, ఆమె అనుచరులు కలిసి తనపై, తన అనుచరుడు ఎం. అంకయ్య (చిన్న)పై దాడికి పాల్పడ్డారని తెలిపారు. ఆర్టీఐ ద్వారా తాను సమాచారం కోరిన విషయాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ముందుగానే ఆస్పత్రి నిర్వాహకులకు తెలపడంతోనే ఈ దాడులు జరిగాయని పేర్కొన్నారు. చట్టప్రకారం 30 రోజుల్లో ఇవ్వాల్సిన సమాచారం ఆలస్యంగా, ఒక్క అంశంపైనే అందించి, మిగిలిన ఆరు అంశాలకు సమాచారం ఇవ్వలేదని తెలిపారు. ఆస్పత్రిపై చర్యలు తీసుకోవాలని, ఆర్టీఐ వివరాలు పూర్తిగా విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తూ ధర్నా నిర్వహించారు.

గ్రంథాలయ వారోత్సవాలలో కవి సమ్మేళనం

విశాలాంధ్ర-వెంకటగిరి: 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగ మహాత్మా గాంధీ శాఖ గ్రంథాలయం, వెంకటగిరిలో కవి సమ్మేళనం నిర్వహించబడింది. టీ లీలావతి గ్రంథాలయ సహాయకురాలు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన తెలుగు ఉపాధ్యాయులు గుర్రాల రమేష్ , విద్యార్థులకు పద్యాల రూపంలో మన ప్రాచీన కవులు సమాజానికి చేసిన సేవలను, వారి సాహిత్య గొప్పతనాన్ని సునిశితంగా వివరించారు. సాహిత్యంపై ఆసక్తి పెంచేలా ఆయన అందించిన సందేశం విద్యార్థులను ఎంతో ఆకట్టుకుంది. కార్యక్రమంలో శ్రీ చైతన్య స్కూల్ ఉపాధ్యాయులు వెంకటేష్, పాఠకులు ప్రకాశ్, సత్యనారాయణ మరియు గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నార

రాయలచెరువు బాధితులకు చీరలు, దుప్పట్లు పంపిణీ

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: కేవీబీపురం మండలంలో రాయలచెరువు బాధితులకు శ్రీకాళహస్తి పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్, సేవా భారతి (ఆర్ఎస్ఎస్) ఆద్వర్యంలో సోమవారం చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. కళత్తూరులో 450 కుటుంబాలకు, పాతపాళెంలో 60 కుటుంబాలకు వీటిని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఎటువంటి లాభాపేక్ష లేకుండా తక్షణమే ముందుండి సేవ చేయడంలో ఆర్ఎస్ఎస్, శ్రీ సరస్వతి శిశు మందిరాలు ముందు ఉంటాయన్నారు. అందులో భాగంగానే కళత్తూరులో సంభవించిన ప్రకృతి వైపరీత్యాన్ని దృష్టిలో ఉంచుకుని... ఆ గ్రామ ప్రజలకు సహాయ సహకారాలను అందించామన్నారు. మానవసేవయే మాధవసేవ అనే భావంతో ఈ కార్యక్రమానికి సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ నేత అంజూరు బాలసుబ్రహ్మణ్యం, శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాల అధ్యక్షులు చాగణం భక్తవత్సలయ్య, మంగిరెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి, నాగరాజు, ఉమా శంకర్, అమరావతి, పద్మశ్రీ, కిషోర్, తరుణ్, చందు, ప్రసాద్, సుధాకర్, పాఠశాల మాతాజీలు పాల్గొన్నారు.

చెరువులో పడి ఇటుక బట్టి కార్మికుడి మృతి

విశాలాంధ్ర-పాకాల: ఇటుక బట్టి కార్మికుడు చెరువులో పడి మృతి చెందిన సంఘటన సోమవారం పాకాల మండలంలో వెలుగు చూసింది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. పాకాల మండలం దామలచెరువు గ్రామపంచాయతీ కుక్కలపల్లి సమీపంలోని లింగన్న చెరువు లో పడి ఒక వ్యక్తి మృతి చెంది ఉండగా గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని వెలికి తీసి, మృతుడు జార్ఖండ్ రాష్ట్రం జనతా రా జిల్లా కర్మాట్రెర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కమరిద్ గ్రామానికి చెందిన మానిక్ బౌరి(40) గా గుర్తించారు. ఇతడు దామల చెరువు సమీపంలోని ఇటుక బట్టీలో కార్మికుడిగా పనిచేస్తుండేవాడు. శనివారం సాయంత్రం ఇటుక బట్టి యజమాని వద్ద డబ్బులు తీసుకుని వచ్చాడని , అప్పటినుండి ఇటుక బట్టి వద్దకుతిరిగి వెళ్లలేదని, బాగా మద్యం సేవించి మద్యం మత్తులో చెరువులో పడి మృతి చెంది ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహం నీటిలో నానడంతో బాగా ఉబ్బిపోయి ఉంది. ఈ సంఘటనపై హెత్తోనిస్టేబుల్ కులశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఒకే పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న తల్లి, కుమారుడు

కమ్మపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఘనసన్మానం

విశాలాంధ్ర-తిరుపతి రూరల్: రామచంద్రపురం మండలం కమ్మపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హృదయాన్ని హత్తుకునే అరుదైన ఘట్టం చోటుచేసుకుంది. ఇదే పాఠశాలలో తల్లి-కుమారుడు ఇద్దరూ ప్రభుత్వ స్కూల్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహిస్తున్న నేపథ్యంలో సోమవారం పాఠశాల విద్యాబోధకులు ప్రత్యేక సన్మానం ఏర్పాటు చేశారు. 2008 డీఎస్సీలో ఎంపికై స్కూల్ అసిస్టెంట్ (జీవశాస్త్రం)గా ప్రతిష్టాత్మక సేవలు అందిస్తున్న ఎస్.జె. కామేశ్వరి పాఠశాలలో విశేష గుర్తింపు పొందిన ఉపాధ్యాయులలో ఒకరు. తాజాగా జరిగిన మెగా డీఎస్సీ-2025లో ఆమె కుమారుడు ఎం.ఎన్. భరద్వాజా స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీష్) పదవికి ఎంపికై ఇదే పాఠశాలలో పదవిలో చేరడంతో పాఠశాల వాతావరణం ఆనందభరితమైంది. ఈ విశిష్ట సందర్భాన్ని పురస్కరించుకొని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల సంస్థ డైరెక్టర్ చిన బాబు పాఠశాలకు విచ్చేసి తల్లి-కొడుకులిద్దరికీ శాలువా కప్పి ఘన సన్మానం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇలాంటి కుటుంబ వారసత్వం కొనసాగడం సమాజానికి ఆదర్శమని ఆయన అన్నారు. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరూ ఒకే పాఠశాలలో ఉపాధ్యాయులుగా సేవలందించడం చాలా అరుదని, ఈ కుటుంబం విద్యాసేవకు నిలువెత్తు నిదర్శనమని ఉపాధ్యాయులు, గ్రామస్తులు ప్రశంసించారు. కార్యక్రమంలో ఇంఛార్జి ప్రధానోపాధ్యాయుడు సభాపతి, ఉపాధ్యాయులు చంద్రశేఖర్ నాయిక్, జయశ్రీ, హిమ బిందు, శోభ రాణి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి క్షేత్రం భక్తులతో కిటకిట

రాత్రి వరకు కొనసాగిన రద్దీ

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో ముక్కంటి క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీ కొనసాగింది. కార్తీకమాసం చివరి సోమవారం, త్రయోదశి కావడంతో భక్తులు తెల్లవారుజాము నుంచి ఆలయానికి పెద్ద సంఖ్యలో వచ్చారు. అన్ని రకాల క్యూ లైన్లు నిండిపోయాయి. అభిషేకాలు, రాహు- కేతు పూజలకు కూడా భక్తులు విశేషంగా తరలి వచ్చారు. ప్రత్యేక క్యూలైన్ ద్వారా దర్శనానికి వెళ్లడానికి కూడా మూడు గంటల సమయం పట్టింది. రద్దీ ఎక్కువగా ఉండటంతో క్యూలైన్లలో తోపులాటలు, గేట్ల వద్ద భక్తులు గుంపులుగా చేరుకోవడం జరిగింది. ఆలయ ఆవరణలోని ధ్వజస్తంభం వద్ద ఉన్న ప్రధాన ద్వారం నుంచి కొందరు గుంపులుగా లోనికి రావడానికి ప్రయత్నించారు. ఈ సందర్భంగా సీఐ ప్రకాశ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు, దేవస్థానం సెక్యూరిటీ సిబ్బంది వారిని బయటకు పంపడానికి ఇబ్బందులు పడాల్సి వచ్చింది. కాశీ విశ్వనాథ స్వామి ఆలయం పక్కనున్న ఖాళీ స్థలంలో, మణికంఠ స్వామి ఆలయ ఆవరణలో భక్తులు దీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఈవో బాపిరెడ్డి ,ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు కొట్టే సాయి ప్రసాద్, ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి తదితరులు పరిశీలించి భక్తులను త్వరగా దర్శనానికి పంపడానికి ఏర్పాట్లు చేశారు.

భక్తులకు అన్నదానం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: కార్తీక మాసం చివరి సోమవారం పురస్కరించుకుని నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో చాముండేశ్వరి దేవాంగుల సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చల్ల జయరామయ్య, చల్ల చిన్నయ్య, పడల శేషు, చల్ల వెంకటేశ్వర్లు, పట్టణ ప్రముఖులు శ్రీవారి సురేష్, బాల, సుధీర్, ప్రసాద్, చాముండేశ్వరి దేవాంగుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సహాయక సేవలో కోలా ఆనంద్

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: కేవీబీపురంమండలంలోని ఓఊరు రాయలచెరువు కట్ట తెగి జల ప్రళయంతో ముంపు గురైన కళత్తూరుదళితవాడవాసులను సోమవారం బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ పరామర్శించారు. కాట్రపల్లి గ్రామస్థులతో కలిసి వారికి అవసరమైన ప్లేట్లు, గ్లాసులు అందించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా ప్రజలను ఆదుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కళ్యాణపురం విద్యార్థులు

విశాలాంధ్ర-పుత్తూరు: చిత్తూరులోని పి వి కే ఎన్ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఎస్‌జిఎఫ్‌సాఫ్ట్ బాల్ అండర్ 14 అండర్ 17 క్రీడా పోటీలలో పుత్తూరులోని కళ్యాణపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. అండర్ 17 నుండి 10వ తరగతి చదివే నవ్య శ్రీ, 9వ తరగతి నుండి మౌనిక, చైతన్య కుమార్, అండర్ 14 విభాగం నుండి 9వ తరగతి చదివే పి హేమంత్, 8వ తరగతి చదివే ఉదయ్ కిరణ్ రెడ్డి, సంజన శ్రీ, అండర్ 19 బేస్ బాల్ నుంచి 10 వ తరగతి చదివే విష్ణవి కామాక్షి, చరణ్ సాయి.. మంచి క్రీడా ప్రతిభను చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి ఆనందబాబు తెలిపారు. ఈనెల 20వ తారీకు నుండి పశ్చిమగోదావరి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో అండర్ 17 క్రీడాకారులు పాల్గొంటారని, ఈనెల 22 నుండి పులివెందులలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో అండర్ 14 క్రీడాకారులు పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయులు జయప్రకాష్ తెలిపారు. వీరి ఎంపిక పట్ల పాఠశాల ఉపాధ్యాయ బృందం క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కాంచన, నీరజ, వేమయ్య, రామకృష్ణ ,షకీలా, భానుమతి తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు పట్టణం టీడీపీ ఆధ్వర్యంలో ఎన్ఎన్ ధనపాల్ ఘన సత్కారం

విశాలాంధ్ర-పుత్తూరు: ఆంధ్రప్రదేశ్ మొదిలియార్ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్గా నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ ప్రతిపాదనలతో పుత్తూరు మున్సిపాలిటీ కు గేట్ పుత్తూరు కి చెందిన ఎన్. ఎన్. ధనపాల్ పుత్తూరు పట్టణ తెలుగుదేశం పార్టీ ముస్లిం మైనార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని గజమాల, శాలవాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారుఅల్లాహ్ యొక్క ఆశీసులు మీకు ఎల్లప్పుడు తోడు ఉంటాయని, మీకు మరెన్నో పదవులు రావాలని ప్రార్థించారు ఈ కార్యక్రమంలో నగరి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ పుత్తూరు పట్టణ అధ్యక్షులు జీవరత్నం నాయుడు %గ్రుతీబ%చిత్తూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి మహమ్మద్ నబి, పుత్తూరు పట్టణ ముస్లిం మైనార్టీ అధ్యక్షులు మహమ్మద్ రఫీ,అమీర్జాన్,కరీం అలీషా, రంజాన్, పటేల్, రజామహమ్మద్, ముస్తఫా, హమీద్ బాషా, సర్దార్, మహమ్మద్, రాజు, హైదర్, సాబీర్ అలీ,యాకూబ్, ఈశ్వర్ యాదవ్, రజిని, మోహన,మొదలగు వారు తదితరులు పాల్గొన్నారు.

పాకాల గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమకారుల సంస్మరణ సభ

విశాలాంధ్ర -పాకాల : స్థానిక పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా సోమవారం గ్రంథాలయ ఉద్యమకారుల సంస్మరణసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాల ఉద్యమకారులు ఎస్ఆర్ రంగ నాథం, అయ్యంకి వెంకటరమణయ్య ,పాతూరి నాగభూషణం , గాడి చర్ల హరిసర్వోత్తమరావు, వెలగా వెంకటప్పయ్య లకు ఘన నివాళులు అర్పించారు. గ్రంథాలయాల స్థాపనకు వారు చేసినటువంటి కృషి ని కొనియాడారు. స్వాతంత్ర ఉద్యమంలో వీరు ఎంతో కృషి చేసి గ్రంథాలయాలను స్థాపించి వాటి ద్వారా విషయాలన్నీ కూడా ఆ ఉద్యమకారులకు చేరవేసి ప్రజలలో చైతన్యం తీసుకొని వచ్చి స్వాతంత్రం పోరాటానికి తన వంతు కృషి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాల అధికారి రవీంద్రబాబు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మాసలామణి, అధ్యాపకులు ఆది శేఖర్ రెడ్డి ,చిట్టి కళావతి, డిగ్రీ కళాశాల విద్యార్థులు, పాల్గొన్నారు.



ఉద్యమకారుల కృషితోనే ప్రజలకు అందుబాటులో పౌర గ్రంధాలయాలు

విశాలాంధ్ర-తిరుపతి :58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని స్థానిక అన్నమయ్య కూడలిలోని గ్రేడ్ 1 శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖులు డాక్టర్ యస్. ఆర్ . రంగనాధన్, పాతూరి నాగభూషణం, అయ్యంకి వెంకట రమణయ్య గాడి చర్ల హరిసర్వోత్తమ రావు మొదలగు వారిని స్మరించుకునే కార్యక్రమం గ్రంథాలయాధికారి జె.శివ ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కె. ఆదిలక్ష్మి ప్రాంతీయ గ్రంథాలయం

గజిటెడ్ లైబ్రేరియన్, తిరుపతి మరియు కె. నటరాజన్, గ్రంథాలయాలధికారి యస్. వి పాలిటెక్నిక్ కళాశాల, తిరుపతి వారు పాల్గొన్నారు . కె. ఆదిలక్ష్మి మాట్లాడుతూ గ్రంథాలయ ఉద్యమం గురించి ఉద్యమ కారుల వల్లే ప్రజలకు ఉచితంగా గ్రంథాలయాలు వెలసిల్లయ్యని, గ్రంథాలయాను నేటి యువత చక్కగా వినియోగించుకోని ఉన్నత శిఖరాలను అందు కోవాలన్నారు. కె. నటరాజన్ మాట్లాడుతూ గ్రంథాలయాల ఆవిర్భావం, గ్రంథాలయ ఉద్యమకారులు చేసిన సేవలను గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో నద్దినారాయణ, ఇంపాక్ట్ ట్రైనర్, కె. జగన్నాథ రెడ్డి విశ్రాంత గ్రంథాలయాధికారి, వి.మునిరాజ, విశ్రాంత గ్రంథాలయాధికారి, గ్రంథాలయ సిబ్బంది రెడ్డమ్మ, నాగరని, గోవిందరాజులు పాల్గొన్నారు.

అయ్యప్పగారిపల్లి ఎంపీటీసీ బాలకృష్ణ నాయుడు తల్లి పార్థీవ దేహానికి నివాళు లర్పించిన ఎమ్మెల్యే మురళి మోహన్

విశాలాంధ్ర-పూతలపట్టు: పూతలపట్టు మండలం అయ్యప్ప గారి పల్లి ఎంపీటీసీ బాలకృష్ణ నాయుడు తల్లి మృతి చెందడంతో ఆమె పార్థవదేహానికి పూతలపట్టు శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మురళి మోహన్ సోమవారం నివాళులు అర్పించారు. ఆమె అనారోగ్యంతో మరణించగ పార్థివదేహాని సందర్శించి నివాలి అర్పించి నారు మన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పూతలపట్టు శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మురళీమోహన్ ఈ కార్యక్రమంలో బంగారుపాళ్యం ఎయంసి చైర్మన్ భాస్కర్ నాయుడు , పూతలపట్టు, తవణంపల్లి, ఐరాల అధ్యక్షులు దొరబాబు చౌదరి, వెంకటేష్ చౌదరి, హరిబాబు నాయుడు, పూతలపట్టు మాజీ అధ్యక్షులు చంద్రమౌళి ,పట్నం గోపి యాదవ్ ,పాల్గొన్నారు.

అధికారులు ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి

విశాలాంధ్ర - కుప్పం: సాధారణ సర్వసభ్య సమావేశం లో మండల అధికారులుతో ఎఎంసి చైర్మన్ జి.ఎం రాజు మాట్లాడుతూ ప్రజలకు ఎపుడు అందుబాటులో ఉండాలని ప్రజా సమస్యల పరిష్కారం పై దృష్టిసరించాలని వివిధ శాఖల అధికారులకు తెలిపారు. గుడిపల్లి మండలానికి అభివృద్ధి కొరకు సిఎం చంద్రబాబు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారన్ని అదే దిశగా అధికారులు పనిచేయాలాని కోరారు. ఈ కార్యక్రమం లో ఎంపిడిఒ, ఎమ్మార్వో, మండల అధికారులు, ఎంపిపి వరలక్ష్మి గోపి , జెడ్పిటిసి కృష్ణమూర్తి, అమీర్ తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లను వెంటనే పూర్తి చేసి లబ్ధిదారులకు ఇవ్వండి

విశాలాంధ్ర-వెంకటగిరి : తిరుపతి జిల్లా వెంకటగిరి మున్సిపల్ 14వ వార్డు కౌన్సిలర్ మరియు వెంకటగిరి నియోజకవర్గ వై.యస్. ఆర్.సి.పి. పార్టీ ఆర్.టి.ఐ. విభాగపు అధ్యక్షుడు ఆరి శంకరయ్య అను నేను, వెంకటగిరి నియోజక వర్గ వై.యస్. ఆర్.సి.పి.పార్టీ సమన్వయ కర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి ఆదేశాల మేరకు,14న వెంకటగిరి టిడ్కో ఇల్లు పరిశీలించారు. 2023లో అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాలమేరకు నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో1152ఇల్లులు పూర్తి చేసి, సదరు ఇళ్లకు రాంకుమార్ రెడ్డి తన సొంత నిధులలో కరెంట్ మీటర్లకు డిపాజిట్ చేసి లబ్దిదార్లకు అందిచడం జరిగినది. ఇంటి

నిర్మాణం పూర్తీ అయిన్నప్పటికీ ఇంకా ఇంటిలోపల పనిపూర్తికాని ఇల్లులు 576 ఉన్నాయి. త్వరిత గతిన పూర్తిచేసి లబ్దిదార్లకు ఇవ్వవలసినదిగా కోరుతున్నాను. అలాగే %ూ-20,ూ-8,ూ-04,ూ-02,ూ-30, ూ-29,ూ-28,ూ-27,ూ%-18 864, 384, ఈ రెండు రకాల ఇంటి నిర్మాణాలు త్వరితగతిన పూర్తీ చేసి లబ్దిదార్లకు అందిచవలసినదిగా కోరుతున్నాను. మౌలిక సదుపాలయ కల్పనా కోసం మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి 10కోట్ల 43 లక్షలు మంజూరు చేసారు. అయితే కేవలం ఒక్క లైన్ మాత్రమే సిమెంట్ రోడ్డు, మరియు సైడ్ కాలువ నిర్మించారు. %ు×ణజూ% ఇల్లు పరిసరాలలో అసంపూర్తిగా నిర్మించిన ఇళ్ల దగ్గర పిచ్చిమొక్కలు మొలచి, పెద్ద పొదలు లాగా ఏర్పడి విష సర్పాలకు ఆవాసంగా మారాయి. వెంటనే %ు×ణజూ% ఇల్లు పరిసరాలలో పిచ్చిమొక్కలు తొలగించవలసినదిగా కోరుతున్నాను. పై అంశాలను తమరు పరిశీలించి వెంటనే పనులు జరుగు విధముగా ఆదేశాలు ఇవ్వవలసినదిగా తమరిని మిక్కిలిగా కోరుతున్నాను.

మన్నించు గణేశా..!

మురుగునీటిలో వినాయకుడి ప్రతిమలు..

ప్రజా సమస్యల పరిష్కార వేదిక దృష్టికి..

విశాలాంధ్ర -ఎర్రగుంట్ల : స్థానిక పురపాలిక వినాయక నగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో వినాయకుడి ప్రతిమల తయారీ కేంద్రాన్ని కొనసాగిస్తున్నారు. ఈ ఏడాది విక్రయించగా మిగిలిపోయిన బొమ్మలను అలాగే ఉంచారు. భారీ వర్షాల కారణంగా వర్షపునీరు ఆ స్థలంలో పెద్ద ఎత్తున నీలిచి మురుగుగా మారి ఉంది. ఈ నీటిలోనే కొన్ని సదరుప్రతిమలు ఉండగా మరికొన్ని నీటిలో పడి తేలుతున్నాయి. ఈ దృశ్యాన్ని చూస్తున్న గణేశుడి భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయి. పవిత్ర స్థలాల్లో ఉంచి భక్తిశ్రద్ధలతో పూజించాల్సిన వినాయకుడి ప్రతిమలు దుర్వాసన వెదజల్లబడుతున్న మురుగు నీటిలో తేలియాడుతుండ టం పట్ల భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదేమి చోద్యమంటూ నిట్టూరు స్తున్నారు. గణేశా మన్నించు అంటూ వేడుకుంటూ నిర్వాహకులకు శాపనార్థాలు పెడుతున్నారు. ధనార్జనే ధ్యేయంగా ప్రతిమల వ్యాపారాన్ని కొనసాగిస్తున్న నిర్వాహకులు భగవంతుడి పట్ల కనీస కృతజ్ఞతా భావం కూడా వ్యక్తం చేయకపోవడం పట్ల తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. కాగా ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ శేష పని మాట్లాడుతూ సదరు స్థల యజమాని, ప్రతిమల తయారీ వ్యాపారికి నోటీసులు జారీ చేస్తామని స్పందించకపోతే పురపాలిక పక్షాన చర్యలు తీసుకుంటామన్నారు. చర్యలు లేని పక్షంలో గణేశుడి భక్తులు ప్రజా సమస్యల పరిష్కార వేదిక దృష్టికి తీసుకుపోవాలని నిర్ణయించినట్లు తెలిసింది.

ఘనంగా 58 వ గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర-కలికిరి : గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా సో మవారం కలికిరిలోని శాఖ గ్రంథాలయంలో ఘనంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి కలికిరి మండల అధ్యక్షుడు కేఎస్ షాబుద్దీన్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సదుం మండల విద్యాశాఖ అధికారి డాక్టర్ వీజీ నటరాజ, వేంపల్లి అబ్దుల్ ఖాదర్, జూనియర్ కళాశాల తెలుగు అధ్యాపకులు మోహన్ రెడ్డి, రిటైర్డ్ టీచర్ రమేష్, మండల విద్యాశాఖ అధికారి2 నాగార్జున పాల్గొని విద్యార్థులకు గ్రంథాలయాల ఆవశ్యకతను వివరించారు. ప్రధానోపాధ్యాయులు నటరాజకు, ప్రముఖ కవి వేంపల్లి అబ్దుల్ ఖాదర్‌కు గ్రంథాలయ అధికారి విజయకుమార్ సత్కరించారు.

పంచాయతీ కార్యాలయానికి భూమి పూజ

విశాలాంధ్ర-చెన్నూరు : మండల పరిధిలోని కోక్కరాయపల్లి గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయం కోసం సోమవారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నర్సింహారెడ్డి భూమి పూజ చేశారు. ఆ గ్రామ నాయకుడు వాసుదేవ రెడ్డి స్థలాన్ని కొని పంచాయతీ కార్యాలయానికి రిజిస్టర్ చేపించారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ రూ.32 లక్షలతో పంచాయతీ కార్యాలయాన్ని నిర్మించారన్నారు. ఇప్పటికే గ్రామంలో రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. సిసి రోడ్లు, డ్రైనేజీలు, వాటర్ పైపులైను ఏవైనా అవసరమైతే పనులు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కల్లూరు విజయభాస్కర్ రెడ్డి, కేసీ కెనాల్ డిసి ప్రెసిడెంట్ బుజ్జన్న, నాగేశ్వర్ రెడ్డి, చెన్నూరు రాంప్రసాద్ మల్లికార్జునరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, పంచాయతీరాజ్ విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రియదర్శన్‌కు పదోన్నతి.. అన్నమయ్య జిల్లా కోడూరుకు బదిలీ..

విశాలాంధ్ర- ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల ఏపీఎస్పీడీసీఎల్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా విధులు నిర్వహిస్తున్న ప్రియదర్శన్ రెడ్డికి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పదోన్నతి లభించింది. ఆ మేరకు పదోన్నతి కల్పించిన ఉన్నతాధికారులు ఈయనను అన్నమయ్య జిల్లా కోడూరుకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఎర్రగుంట్లలో విధులు నిర్వహించిన సమయంలో ప్రియదర్శన్ రెడ్డి వినియోగదారుల సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత నిస్తూ ఈ ప్రాంత ప్రజల మన్ననలు పొందారు. వినియోగదారుడు ఏదేని సమస్యపై కార్యాలయాన్ని సంప్రదించిన సమయంలో వెంటనే స్పందించే వారన్న ఖ్యాతి గడించారు.కాగా ప్రియదర్శన్ రెడ్డికి పదోన్నతి లభించడం పట్ల ఈ ప్రాంత వాసులతోపాటు విద్యుత్, ఉద్యోగులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా బూచు పల్లె వారి వివాహ వేడుక..

నూతన వధూవరులను ఆశీర్వదించిన భూపేష్

విశాలాంధ్ర-ఎర్రగుంట్ల: తుమ్మల పల్లెకు చెందిన సివిల్ కాంట్రాక్టర్, ఎన్డీఏ కూటమి నేతలు బూచు పల్లె గంగాధర్ రెడ్డి సోదరి సుమలత వివాహ వేడుక ఘనంగా జరిగింది. జమ్మలమడుగు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి చది పిరాళ్ల భూపేష్ రెడ్డి, ఎన్డీఏ కూటమి మండల పర్యవేక్షకులు తప్పెట్ల మధుసూదన్ రెడ్డి, మార్కెట్ కమిటీ అధ్యక్షులు ఆర్ నాగరాజుతోపాటు పలువురు నేతలు వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులైన సుమలత, శ్రీనివాసుల రెడ్డి దంపతులను ఆశీర్వదించారు. గంగాధర్ రెడ్డి జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, టిడిపి ఇన్చార్జి భూపేష్ రెడ్డి ముఖ్య అనుచరుడిగా కొనసాగుతుండడం, ఇక్కడి సిమెంట్ పరిశ్రమలతో పాటు, ఇతరత్రాచోట్ల సివిల్ కాంట్రాక్టు పనులు చేస్తుండడంతో వివాహ వేడుకకు రాజకీయ రంగ ప్రముఖులు, వాణిజ్య, వ్యాపార, ఈ ప్రాంత ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. గంగాధర్ రెడ్డి బంధువులు, హితులు, స్నేహితులు, సన్నిహితులు, శ్రేయోభి లాషులు వేడుకకు హాజరై కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

చంద్రబాబు మైనారిటీల పక్షపాతి :ఎమ్మెల్యే షాజహాన్ భాష

విశాలాంధ్ర-మదనపల్లె: మైనారిటీల అభ్యున్నతి కోసం ఎల్లవేళలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే షాజహాన్ భాష పేర్కొన్నారు. టీడీపీ కార్యాలయంలో ముస్లిం మత పెద్దలతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ షాదీ మహల్ లు , హజ్ హౌస్ నిర్మాణం, ఇమామ్, మౌజంలకు జీతాలు, ఉర్దూ పండిట్లు మసీదులు అభివృద్ధి వర్క్ ఆస్తుల రక్షణ ఇలా ఎన్నో పథకాలను ముస్లిం మైనారిటీల అభివృద్ధి కోసం చేపడుతూ... ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముస్లింల పక్షపాతిగా నిలుస్తున్నారని అన్నారు... ఇమామ్, మౌజమ్‌కు 90 కోట్ల రూపాయల వేతన బకాయిలు అందించి ముస్లింల సమాజానికి అండగా నిలుస్తున్నారని అన్నారు..ఈ సమావేశంలో ముస్లిం సోదరులతో పాటు ఇమామ్, మౌజమ్ పాల్గొన్నారు.

రచ్చబండ కార్యక్రమాలకు తరలిరండి

విశాలాంధ్ర- నిమ్మనపల్లి: రాష్ట్ర ప్రభుత్వం పిపిపి విధానం ద్వారా చేపడుతున్న మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైసీపీ అధిష్టానం రచ్చబండ కార్యక్రమం ద్వారా కోటి సంతకాల సేకరణకు పిలుపునిచ్చిందని నిమ్మనపల్లి మండల వైసీపీఅధ్యక్షులు కొమ్మేపల్లి శ్రీనివాసులు రెడ్డి అన్నారు. ఇందులో భాగంగా మంగళవారం మదనపల్లి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త నిస్సార్ అహ్మద్ నిమ్మనపల్లి మండలంలో పర్యటిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉదయం గం.10 లకు చల్లావారిపల్లె, గం.11లకు నల్లంవారిపల్లె, మధ్యాహ్నం గం.12 లకు వెంగంవారిపల్లె, గం.2లకు సామకోటవారిపల్లె, గం.3లకు అగ్రహారం, గం.4లకు నిమ్మనపల్లెలో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించి మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ సంతకాలను సేకరిస్తున్నట్లు తెలిపారు.

ఆడపిల్లలను కాపాడుదాం.. వారిని చదివిద్దాం

విశాలాంధ్ర- నిమ్మనపల్లె : మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఐసిడిఎస్ సూపర్వైజర్లు ధనలక్ష్మి, కుసుమారాణి ల ఆధ్వర్యంలో " భేటీ బచావో బేటి పడావో " కార్యక్రమం పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈఓ నారాయణ, ఏఓ రమేష్ బాబు, డిప్యూటీ ఎంపీడీఓ బాలరాజులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆడపిల్లల లింగ నిష్పత్తిని కాపాడడం వారికి విద్యను చేరువ చేయాలని లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం " భేటీ బచావో బేటి పడావో" కార్యక్రమం తీసుకువచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం మురళి, పంచాయతీ కార్యదర్శులు, మహిళా సంరక్షణ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, అంగన్వాడి కార్యకర్తలు, ఆశా వర్కర్లు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయంలో ఆకట్టుకున్న కవి సమ్మేళనం

విశాలాంధ్ర-మదనపల్లె : 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా సోమవారం గ్రంథాలయాధికారిణి ఆర్.వసంత కుమారి ఆధ్వర్యంలో కవిసమ్మేళనం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మదనపల్లి రచయితలు సంఘం ప్రధాన కార్యదర్శి లింగాల యుగంధరాచారి,సాయి చైతన్య కాలేజీ చైర్మన్ డాక్టర్ నిర్మల్ కుమార్ రెడ్డి,డాక్టర్ అప్సర్ ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా డాక్టర్ అప్సర్ విద్యార్థినులకు చిన్న,చిన్న కథలతో వారి విద్యాభ్యాసం ఎలా ఉండాలో వివరించి చెప్పారు.అనంతరం శ్రీసాయి చైతన్య కాలేజీ చైర్మన్ నిర్మల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ విద్యాభ్యాసం కాలంలో తాము గ్రంథాలయాలను ఏవిధంగా ఉపయోగించుకున్నారో అనే విషయం తెలిజేశారు.విద్యార్థులు మొబైల్ ఫోన్లు పక్కన పెట్టేసి సెలవులు,ఖాళీ సమయంలో గ్రంథాలయానికి వచ్చి పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని తెలియజేశారు.అదేవిధంగా లింగాల యుగంధరాచారి అధ్యక్షతన జరిగిన కవితోత్సవంలో భాగంగా కవులైన లింగాల యుగంధరాచారి, శరత్ బాబు,రామ్మోహన్ నాయుడు,రామ్మోహన్ రెడ్డి,నాగభూషణం రావు,హేమలత, లక్ష్మీ ప్రసన్న,కుమారస్వామి,రాఘవేంద్ర బాబు,ఖాదర్ భాషా కవులు,కవయిత్రులు తమ తమ కవితలతో పిల్లలను పాఠకులను ఆకట్టుకున్నారు.ఈ కార్యక్రమంలో శ్రీసాయి చైతన్య జూనియర్ కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

నేడు మాజీ సీఎం నల్లారి కిరణ్ కలికిరికి రాక

విశాలాంధ్ర-కలికిరి : మాజీ ముఖ్యమంత్రి, బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి ఈనెల 18న కలికిరికి రానున్నారు. మంగళవారం ఉదయం హైదరాబాదులో బయలుదేరి మధ్యాహ్నం 12:00 గంటల 25 నిమిషాలకు రేణిగుంట విమానాశ్రమం చేరుకుంటారు. అనంతరం 12:35 గంటలకు విమానాశ్రయం నుండి బయలుదేరి రోడ్డు మార్గంలో మధ్యాహ్నం రెండు 2:35 నిమిషాలకు కలికిరికి చేరుకుంటారని ఆయన వ్యక్తిగత కార్యదర్శి కృష్ణప్ప తెలిపారు. కలికిరి బిజెపి కార్యాలయంలో రెండు రోజులు పాటు నాయకులకు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటారు.

మాల మహానాడు జిల్లా ఉపాధ్యక్షులుగా గుండ్లూరు విజయ్ కుమార్

విశాలాంధ్ర-కలికిరి : మదనపల్లిలో మాల మహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షులు యమల సుదర్శన్ ఆధ్వర్యంలో మాలమహానాడు సభలను నిర్వహించి విజయవంతంగా కొనసాగించారు. ఈ మాల మహానాడు సభలో కొత్త కమిటీ నియమించినారు ఈ కమిటీలో అన్నమయ్య జిల్లా ఉపాధ్య క్షులుగా కలికిరి ఇందిరమ్మ కాలనీకి చెందిన గుండ్లూరు విజయ కుమార్‌ను ్న ఉపాధ్యక్షులుగా నియమించారు. విజయ్ కుమార్ మాట్లాడుతూ నేను మాల మహానాడు సంఘానికి నా వంతు కష్టపడి పని చేస్తానన్నారు. నాకు అవకాశం కల్పించిన మాలమహానాడు అధికార ప్రతినిధి హరికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మనోహర్, మోహన్, చంద్ర, ఎన్టీ రమణ, రామకృష్ణ, సహదేవ, హరి, సతీష్, అంకన్న, పలవలి రమణ, గుండ్లూరు వెంకటరమణ, విశ్వనాథ, శ్రీను, అర్జున, తదితరులు పాల్గొన్నారు.

భానుకోట సోమేశ్వరుని దర్శించుకున్న స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్

విశాలాంధ్ర- సింహాద్రిపురం : మండల పరిధిలోని భానుకోట క్షేత్రంలో వెలసిన భానుకోట సోమేశ్వరుని కార్తీక మాసం చివరి మాసం సందర్భంగా ఢిల్లీ స్పోర్ట్స్ అథారిటీ కేలో ఇండియా డైరెక్టర్ కె .హిమబిందు, ఐఏఎస్ దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు బద్రీనాథ్ శర్మ ఆధ్వర్యంలో ఘనంగా ఆహ్వానించి విశేష పూజలు నిర్వహించి ఆమెకు తీర్థ ప్రసాదాలు అందించారు.

క్రికెటర్ శ్రీ చరణికి పిఆర్ అభినందనలు..

విశాలాంధ్ర- ఎర్రగుంట్ల : మహిళల వన్డే వరల్డ్ కప్‌లో అద్భుత ప్రదర్శన కనపరచి జట్టును గెలిపించడంలో కీలక పాత్ర పోషించిన నల్లపురెడ్డి శ్రీ చరణిని మాజీ మంత్రి, శాసన మండలి సభ్యులు పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి ఆయన సోదరుడు మాజీ ఎంపీపీ గిరిధర్ రెడ్డి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీచరణి భవిష్యత్తులో మరింత ఎదగాలని ఈ సందర్భంగా పిఆర్ ఆకాంక్షించారు. ఈ విజయం వెనుక ఆమెను ప్రోత్సహించిన మామ కిషోర్ కుమార్ రెడ్డి, సహకరించిన తల్లిదండ్రుల కృషి కూడా ఉందని ఎమ్మెల్సీ కితాభిచారు. ఎన్ని కష్టాలు ఎదురైనప్పటికీ ఆమె పాదాలు మైదానం వైపు మల్లడంక్రీడల పట్ల శ్రీ చరణికి ఉన్న ఇష్టాన్ని గుర్తుకు తెస్తోందని పిఆర్ పేర్కొన్నారు. క్రికెటర్ తండ్రిని వీరు సత్కరించి వారికి శ్రీ చరణి చిత్రపటాన్ని అందజేశారు.

మిట్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్ ప్రధానం

విశాలాంధ్ర-మదనపల్లె: మిట్స్ సీనియర్ అసిస్టెంట్ డైరెక్టర్ (అడ్మిషన్స్) మరియు కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న వి మారుతి ప్రసాద్‌కు తమిళనాడులోని చెన్నైలో గల సత్యభామ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (డీమ్డ్ టు బి యూనివర్సిటీ) వారు డాక్టర్ పట్టాను అందజేసినట్లు మిట్స్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ సి. యువరాజ్ తెలిపారు. సత్యభామ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (డీమ్డ్ టు బి యూనివర్సిటీ) లోని కంప్యూటర్ సైన్స్, ఇంజనీరింగ్ విభాగము నుండి పిహెచ్‌డి డిగ్రీ పొందినట్లు, అక్కడే పనిచేస్తున్న ప్రొఫెసర్ బి. భారతి పర్యవేక్షణలో "యాన్ ఇంటెలిజెంట్ మల్టీమోడల్ సెక్యూరిటీ ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఎమర్జింగ్ అప్లికేషన్స్ యూజింగ్ ఐఓటి" అను అంశం పై చేసిన పరిశోధన కు గాను డాక్టర్ పట్టా ను అందజేసినట్లు ఆయన అన్నారు.

మండల సర్వసభ్య సమావేశం వాయిదా

విశాలాంధ్ర-సంబేపల్లె: మంగళవారం జరగవలసిన మండల ప్రజా పరిషత్ జనరల్ బాడీ మీటింగ్ కొన్ని అనివార్య కారణాల వలన వాయిదా వేయడం జరిగినదని ఎంపీడీవో వెంకటసుబ్బారెడ్డి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా అధికారులకు సమావేశానికి హాజరు కానవసరం లేదని తెలియజేశారు. తరువాత జరుగు మండల ప్రజాపరిషత్ జనరల్ బాడీ మీటింగ్ (సర్వ సభ్య సమావేశం) గురించి త్వరలోనే తెలియజేస్తామని పేర్కొన్నారు.

శ్రీ పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలకు సాంస్కృతిక శోభ

విశాలాంధ్ర-తిరుపతి: శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఆధ్యాత్మిక, ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. చిన్న శేష వాహనంలో భాగంగా సోమవారం సాయంత్రం తెలంగాణ రాష్ట్రం నుండి గుస్సాడి, బతుకమ్మ, చెక్కభజనలతో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అదేవిధంగా, తిరుపతి ఎస్వీ మ్యూజిక్ కాలేజీ నుండి నృత్యం, కత్తి నాట్యం, రాజమండ్రి నుండి నెమలి డ్యాన్స్, అన్నమాచార్య ప్రాజెక్టు నుండి కోలాటం, కూచిపూడి నృత్యం, హెచ్‌డిపిపి నుండి సాంప్రదాయ పాఠశాల కళాకారులు దీపలక్ష్మి నృత్యం, దాస సాహిత్య ప్రాజెక్టు నుండి విజయవాడ కు చెందిన కోలాటం, కర్నాటక నుండి పద్మావతీ కల్యాణం భరత నాట్యం ఆకట్టుకున్నాయి. అదేవిధంగా, తిరుచానూరు ఆస్థానమండపంలో ఉదయం 4.30 నుండి 5.30 గంటల వరకు ఎస్వీ సంగీత నృత్య కళాశాల ఆధ్వర్యంలో మునిరత్నం, కృష్ణారావు, చంద్రశేఖర్ బృందం మంగళధ్వని, ఉదయం 5:30 నుండి 6:30 గంటల వరకు తిరుపతికి చెందిన సరళ బృందం లక్ష్మీ సహస్రనామ పారాయణం, ఉదయం 10 నుండి 11 గంటల వరకు ఎస్వీ ఉన్నత వేద అధ్యయన సంస్థకు చెందిన పండితులచే చతుర్వేద పారాయణం నిర్వహించారు. ఉదయం 11 నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఎస్ వి సంగీత నృత్య కళాశాల అధ్యాపకులు జయరామ్ బృందం భక్తి సంగీత కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నది. అనంతరం మధ్యాహ్నం 3 నుండి 4 గంటల వరకు తాడేపల్లిగూడెంకు చెందిన బాల సుందరం బృందం హరికథ గానం చేశారు. సాయంత్రం 4 నుండి 5 గంటల వరకు తిరుపతికి చెందిన మాధురి బృందం అన్నమయ్య విన్నపాలు, సాయంత్రం 5:30 నుండి 6 గంటల వరకు ఊంజల సేవలో తిరుపతికి చెందిన రంగనాథ్ బృందం అన్నమయ్య సంకీర్తనలను గానం చేశారు. అదేవిధంగా తిరుపతిలోని మహతి కళాక్షేత్రంలో సాయంత్రం 6.30 గంటల నుండి రాజమండ్రి కి చెందిన లక్ష్మీ దీపిక బృందం కూచిపూడి నృత్యం, అన్నమాచార్య కళామందిరంలో సాయంత్రం 6:30 గంటల నుండి బెంగుళూరు చెందిన సత్యబాంబ బృందం, కర్నూలుకు చెందిన ఆంజనేయులు బృందం భక్తి సంగీత, నృత్య కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. రామచంద్ర పుష్కరిణి వద్ద సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్ కు చెందిన పృథ్వీరాజ్ నామ సంకీర్తన భక్తులను ఆకట్టుకుంది. తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో సాయంత్రం 6.30 గంటల నుండి ఎస్వీ సంగీత నృత్య కళాశాల అధ్యాపకులు, విద్యార్థులచే గానం మురళీ గానం, కూచిపూడి నృత్యం ప్రదర్శించారు.

ముక్కంటి సేవలో ఐటీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని సోమవారం ఐటీడీపీ రాష్ట్ర ప్రధనా కార్యదర్శి దేవభక్తుని శివకృష్ణ తన జన్మదినం సందర్భంగా కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈయనకు తిరుపతి పార్లమెంటు ఐటీడీపీ అధ్యక్షులు యాచేంద్ర, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బాలాజీ రెడ్డి, శ్రీకాళహస్తి నియోజకవర్గం ఐటీడీపీ అధ్యక్షులు ఖాదర్, పవన్ స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. అదేవిధంగా స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

వరసిద్ధి వినాయక స్వామి వారి నిత్య అన్నదానానికి పలువురు దాతలువిరాళం

విశాలాంధ్ర-పూతలపట్టు: శ్రీ స్వామివారి దేవస్థానం నిత్య అన్నదానానికి విరాళం - 1,00,700/- రూపాయలు, దాత - లంకిపల్లి పద్మావతి, లంకిపల్లి శివ సుబ్రమణ్యం నాయుడు, వారి కుటుంబ సభ్యులకు కడపజిల్లా పులివెందుల వాస్తవులుదాతలు తిరుమలరెడ్డి కూడ నిత్య అన్నదానానికి 1,00,116 రూపాయలువిరాలంవిచారువీరికి కాణిపాకం ఆలయ అధికారులు వీరికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసిన ఏఈఓ రవీంద్రబాబు ,సూపర్డెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్పెక్టర్ బాలాజీ నాయుడు, తదితరులు ఉన్నారు.

ప్రయోజకులు కావాలంటే పది రకాల పుస్తకాలు చదవాలి

విశాలాంధ్ర-వి.కోట: ప్రయోజకులు కావాలంటే పది రకాల పుస్తకాలు చదివి వ్నినాన్ని పెంపొందించుకోవాలని జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా సోమవారం స్థానిక శాఖ గ్రంధాలయం లో కవిసమ్మేళనాలు, సెమినార్లు, రచయితల సందేశాలు నిర్వహించారు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జెడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు పైవిధంగా మాట్లాడుతూ అలాగే చదువుకోవాలని ఉన్నా పుస్తకాలు కొనలేని పేదవారికి గ్రంధాలయాలు ఎంత గానో ఉపయోగపడుతున్నయన్నారు. కళా భారతి అధ్యక్షులు డా.వి రఘుపతి అద్యక్షతన జరిగిన కార్యక్రమంలో స్థానిక కవులు తమ కవితలను మరియు రచనలను వినిపించారు. జరిగింది. కార్యక్రమంలో కవులు ప్రముఖులు కొఠారి వెంకటరత్నం, డా.జీ శాంతకుమారి, సి హెచ్ రమేష్, ప్రముఖులు టి. శివరాం, టి.మంజుల, యు. సేనావతి, బి. విజయ, గ్రంథాలయ సిబ్బంది మొహమ్మద్ వాహబ్ మరియు గ్రంథాలయ పాఠకులతో పాటు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినిలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కళ్యాణపురం విద్యార్థులు

విశాలాంధ్ర-పుత్తూరు: చిత్తూరులోని పి వి కే ఎన్ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఎస్‌జిఎఫ్ సాఫ్ట్ బాల్ అండర్ 14 అండర్ 17 క్రీడా పోటీలలో పుత్తూరు లోని కళ్యాణపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని అండర్ 17 నుండి 10 వ తరగతి చదివే నవ్య శ్రీ, 9వ తరగతి నుండి మౌనిక, చైతన్య కుమార్, అండర్ 14 విభాగం నుండి 9 వ తరగతి చదివే పి హేమంత్, 8వ తరగతి చదివే ఉదయ్ కిరణ్ రెడ్డి, సంజన శ్రీ, అండర్ 19 బేస్ బాల్ నుంచి 10 వ తరగతి చదివే విష్ణవి కామాక్షి, చరణ్ సాయి.. మంచి క్రీడా ప్రతిభను చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి ఆనందబాబు తెలిపారు. ఈనెల 20వ తారీకు నుండి పశ్చిమగోదావరి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో అండర్ 17 క్రీడాకారులు పాల్గొంటారని, ఈనెల 22 నుండి పులివెందులలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో అండర్ 14 క్రీడాకారులు పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయులు జయప్రకాష్ తెలిపారు. వీరి ఎంపిక పట్ల పాఠశాల ఉపాధ్యాయ బృందం క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కాంచన, నీరజ, వేమయ్య, రామకృష్ణ ,షకీలా, భానుమతి, శ్రీ పాల్గొన్నారు.

శ్రీ వినాయక స్వామి వారి సేవలో తెలంగాణ ఇన్ఫర్మేషన్ కమిషనర్

విశాలాంధ్ర-పూతలపట్టు: శ్రీ స్వామివారిని దర్శించుకున్న తెలంగాణ ఇన్ఫర్మేషన్ కమిషనర్ బోరెడ్డి అయోధ్య రెడ్డి, స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ రవీంద్రబాబు టెంపుల్ ఇన్స్పెక్టర్ బాలాజీ నాయుడు, తదితరులు ఉన్నారు.

ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్ లో ప్రపంచ ప్రీమేచ్యూర్ దినోత్సవం

విశాలాంధ్ర-తిరుపతి రూరల్: ప్రపంచ ప్రీమేచ్యూర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్‌లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అకాలంలో పుట్టిన శిశువుల సంరక్షణ,వారి ఆరోగ్య సమస్యలు, తల్లిదండ్రులకు అవసరమైన మార్గదర్శకత వంటి అంశాలపై వైద్యులు విలువైన సూచనలు అందించారు. ఈ కార్యక్రమానికి నీయోనేటల్ కేర్ పొందిన చిన్నారులు, వారి కుటుంబ సభ్యులు హాజరై అనుభవాలను పంచుకున్నారు. డా. ఎం. కిరణ్ కుమార్ (నీయోనాటాలజిస్ట్) మాట్లాడుతూ ప్రీమేచ్యూర్ బేబీలకు ప్రత్యేక చికిత్స,సమగ్ర వైద్య సంరక్షణ అత్యంత అవసరం.ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్‌లో లెవల్-3 ఎన్‌ఐసీయూ,అత్యాధునిక వెంటిలేటర్లు, సీపీఏపీ, హెచ్ఎఫ్ఓవీ, టీపీఎన్ వంటి సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. అలాగే అత్యవసర పరిస్థితుల్లో ఎక్కడినుండైనా ప్రీమేచ్యూర్, న్యూబార్న్‌లను సురక్షితంగా ఎన్‌ఐసీయూకి తరలించేందుకు ప్రత్యేక నీయోనేటల్ ట్రాన్స్‌పోర్ట్ అంబులెన్స్ సేవ కూడా అందుబాటులో ఉందన్నారు. డా. లతీష్ కుమార్ రెడ్డి (నీయోనాటాలజిస్ట్) మాట్లాడుతూ ప్రీమేచ్యూర్ శిశువులలో శ్వాసకోశ సమస్యలు, తక్కువ బరువు, ఉష్ణోగ్రత నియంత్రణ లోపాలు, ఇన్ఫెక్షన్ల ముప్పు ఎక్కువగా ఉంటాయి. మా ఎన్‌ఐసీయూలో ప్రతి శిశువుకు వ్యక్తిగతంగా నిరంతర మానిటరింగ్, వెంటిలేటరీ సపోర్ట్, పోషణ, హై స్టాండర్డ్ ఇన్ఫెక్షన్ కంట్రోల్ ప్రాక్టీసెస్ అందుబాటులో ఉన్నాయి. తల్లిదండ్రులకు శిశువుల సంరక్షణపై అవగాహన కల్పించడం, ముఖ్యంగా బ్రెస్ట్ ఫీడింగ్, కంగారూ మదర్ కేర్‌ను ప్రోత్సహించడం మా ప్రధాన బాధ్యత. ప్రీమేచ్యూర్ బేబీల జీవనశాతం మెరుగు పడటానికి కుటుంబ సహకారం కూడా అంతే ముఖ్యమన్నారు. డా. శ్రీధర్ ముని(చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ - ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్) మాట్లాడుతూ మదర్, చైల్డ్ కేర్ సేవలలో ఉన్నత ప్రమాణాలను కొనసాగిస్తూ, ప్రీమేచ్యూర్ బేబీల ఆరోగ్య సంరక్షణలో మా ఆస్పత్రి కీలక పాత్ర పోషిస్తోంది. అధునాతన సదుపాయాలు, అనుభవజ్ఞులైన వైద్యులు, నర్సింగ్ టీమ్,ఇవి అన్నీ కలిసి అత్యుత్తమ ఫలితాలను అందించడానికి సహాయపడుతున్నాయి. ముఖ్యంగా అత్యున్నత నాణ్యతను, అందుబాటులో ఉండే వ్యయంతో సేవలను అందించడం మా ప్రధాన లక్ష్యం. ప్రజలకు చేరువైన ధరల్లో ప్రీమేచ్యూర్ బేబీలకు కావాల్సిన అన్ని సదుపాయాలు ఒకేచోట అందుబాటులో ఉన్నాయంటే అది మా గర్వకారణమని తెలిపారు. కార్యక్రమానికి వచ్చిన తల్లిదండ్రులు తమ ప్రీమేచ్యూర్ బేబీలు ఎలా ఆరోగ్యంగా ఎదిగారో భావోద్వేగంతో పంచుకున్నారు.వైద్యులు కంగారూ మదర్ కేర్ గురించి సులభమైన భాషలో వివరించారు.తల్లి లేదా తండ్రి శిశువును తన ఛాతీపై చర్మానికి చర్మం తాకేలా పట్టుకోవడం వల్ల శిశువుకు వేడి, భద్రత, శ్వాస నియంత్రణ, బరువు పెరగడం వంటి అనేక ప్రయోజనాలు లభిస్తాయిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డా. అనంత్ (పీడియాట్రిషన్), డా. నిహారిక (గైనకాలజిస్ట్), డా. కనిష్క లాక్టేషన్ కౌన్సిలర్,మదర్, చైల్డ్ డిపార్ట్‌మెంట్ బృందం పాల్గొన్నారు.